నీటి వనరుల నిర్వహణకు బులెటిన్ మార్గదర్శకంగా నిలుస్తుంది

- కలెక్టర్ రాజకుమారి



నీటి బులెటిన్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, టీజీ ఈఈ ప్రతాప్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా నంద్యాల జిల్లాలో ప్రయోగాత్మకంగా చేపట్టిన నీటివనరులకు సంబంధించిన నీటి బులెటిన్ మార్గదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ రాజకుమారి అన్నా రు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నీటి బులెటిన్ బుక్‌లెట్‌ను కలెక్టర్, తెలుగుగంగ ఈఈ ప్రతా ప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి బులెటిన్ కేవలం సంఖ్యలు, గణాంకాల సమాహారం కాదని, ప్రజలకు రైతులకు, అధికారులకు ఒక మార్గసూచిక అని పేర్కొన్నారు. వరద హెచ్చరికలు, జలశయాల్లో నీటి స్థితి, భూగర్భజలాల వివరాలు, సాగు, తాగునీరు, ఇతర అవసరాలకు నీటి అందుబాటు, నీటి కొరతను అంచనా వేసి నీటి సంరక్షణపై సూచనలు ఇస్తుందన్నారు. జిల్లా మొత్తాన్ని ఒకే వేదిక కిందికి తెచ్చి ప్రస్తుత నీటి పరిమాణం, రాబోయే వర్షాల అంచనాలను పరిగణలోకి తీసుకరావడ వల్ల నీటిని సక్రమంగా వినియోగించు కోవచ్చన్నారు. వినూత్న ప్రయోగాత్మక బులెటిన్‌ను రూపొందించడంలో కృషిచేసిన తెలుగుగంగ ఈఈ ప్రతాప్‌ను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

జిల్లాలో యూరియా కొరత లేదు: కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ రాజకుమారి అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం యూరియా గురించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, జేసీ విష్ణుచరణ్‌తో పాటు వ్యవసాయాధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 9300 టన్నుల యూరియా చేరుతోందని, బుధవారం 2600 టన్నులు, 5వ తేదీ 2600 టన్నులు, 10వతేదీన 2600 టన్నులు, 13న 1500 టన్నులతో కలిపి మొత్తంగా 9300 టన్నులు జిల్లాకు చేరుతుందని వివరించారు. అందులో మార్క్‌ఫెడ్ ద్వారా 6,050 టన్నులు రైతు సేవా కేంద్రాలకు, మిగితా 3,250 టన్నుల యూరియా ప్రైవేట్ డీలర్‌లకు కేటాయించినట్లు తెలిపారు. యూరియా పంపిణీలో ఏవైన సమస్యలు తలెత్తితే నంద్యాల కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూం 08514293903 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కంట్రోల్ రూం ప్రతిరోజు ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా మాట్లాడుతూ యూరియాను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కరువు నేలకు కన్నీళ్లు!

కళ్ల ముందే కృష్ణాజలాలు అనంతపురం.. కుప్పం వైపు తరలిపోతున్నాయి. ఆ నీటిని కరువు నేలకు మళ్లించాల్సిన పాలకుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. పత్తికొండ జలాశయం కుడి కాలువకు నీటిని విడుదల చేసినా పొలాలకు మళ్లించలేని దైన్యపరిస్థితి. పంట కాలువలు అసంపూర్తిగా వదిలేయడమే కారణం. కుప్పానికి నీళ్లు తీసుకెళ్లామని పాలకులు, ఇంజనీర్లు సంబరాలు చేసుకుంటున్నారు. అదే స్ఫూర్తితో పశ్చిమ ప్రాంతం కరువు, వలసలు నివారించేందుకు పంట కాలువలు పూర్తి చేయక పోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రధాన కాలువలో కృష్ణమ్మ ప్రవహిస్తుంది. పక్కనే పంట కాలువలు వెలవెలబోతున్నాయి. డిస్ట్రిబ్యుటరీలు లేకపోవడం.. నీటిని మళ్లించు కోవడానికి రైతులు పోటీ పచ్చని పల్లెసీమల్లో జల జగడాలకు ఆజ్యం పోస్తుంది. పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ ప్రధాన కాలువ కింద అసంపూర్తి పంట కాల్వలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.



హంద్రీ-నీవా పత్తికొండ జలాశయం కుడి ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు



చుక్కనీరు లేక వెలవెలబోతున్న పంట కాలువ

- కళ్ల ముందే కృష్ణమ్మ పరుగులు
- అసంపూర్తిగా హంద్రీనీవా పంట కాలువలు
- పత్తికొండ జలాశయం నుంచి కుడి కాలువకు నీటి విడుదల
- పల్లెల్లో జల జగడాలు
- రూ.210 కోట్లు ఇస్తేనే కరువు నేల సస్యశామలం





కరివేముల వద్ద రోడ్డు క్రాసింగ్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో అడ్డంగా ఓ పైపు వేసి నీటిని మళ్లించుకుంటున్న రైతులు

కర్నూలు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం ఎగువన 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు హంద్రీనీవా కాలువకు ఎత్తిపోసి, రాయలసీమ జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 8టీఎంసీలు వాడుకునే హక్కు ఉంది. నందికొట్కూరు, పాణ్యం, పత్తికొండ, ఆలూరు నియోజక వర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. 0.16 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన కృష్ణగిరి జలాశయం కింద 5.100ఎకరాలు, 1.126 టీఎంసీల సామర్థ్యంతో పత్తికొండ (పందికోన) జలాశయం కుడి కాలువ కింద 10,774 ఎకరాలకు, ఎడమ కాలువ కింద 50,626 ఎకరాలు కలిపి 61,400ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉంది. పూర్తిస్థాయిలో సాగునీరు ఇస్తే పత్తికొండ, దేవనకొండ, ఆస్పరి మండలాలు పచ్చని పైర్లతో సస్య శ్యామలం అవుతాయి. కరువు, వలసలు ఆగిపోతాయి. పంట కాలువలు అసంపూర్తిగా వదిలేయడంతో 17-19వేల ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది. రూ.3,500కోట్లలో హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఫేజ్-1 పరిధిలో విస్తరణ 90-95 శాతం పూర్తిచేశారు. తొలిసారిగా 2,824 క్యూసెక్కులకు పైగా ఎత్తిపోస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం బ్రాంచి కెనాల్‌కు కృష్ణాజలాలు చేరడంతో సీఎం చంద్రబాబు జలహారతి ఇచ్చారు. రైతులు సంబరాలు చేసుకున్నారు. ఇది కూటమి ప్రభుత్వం సాధించిన పురోగతి. రాయలసీమ కరువు నేలకు ఎక్కడికి నీళ్లు తీసుకెళ్లినా అభినందించాల్సిందే. కళ్ల ముందే కృష్ణాజలాలు తరలిపోతుంటే.. ఆ నీటిని కరువు నేలకు మళ్లించుకోలేక కష్టజీవులు కన్నీరు పెడుతున్నారు.

మిగతా 6లో..

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నలుగురికి అవకాశం



నాగముని



వడ్డు లక్ష్మీదేవి



మునియార్ ఖలీల్‌అహ్మద్



కుమ్మరి సుధాకర్

నంద్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 11 కార్పొరేషన్లకు డైరెక్టర్లను బుధవారం నియమించింది. డైరెక్టర్ల నియామకంలో జిల్లాకు సముచిత స్థానం కల్పించారు. టీడీపీ నుంచి నలుగురికి అవకాశం కల్పించారు. కీలకమైన కార్పొరేషన్లలో ఛాన్స్ ఇవ్వడంతో జిల్లాకు రాజకీయంగా సముచిత స్థానం దక్కినట్లయింది. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పాణ్యం నియోజకవర్గానికి చెందిన జె.నాగముని ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈయన టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా డోన్‌కు చెందిన కె.సుధాకర్ నియమితులయ్యారు. ఇక నంద్యాల పట్టణానికి చెందిన ఖలీల్ అహ్మద్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికయ్యారు. పాణ్యం నియోజకవర్గంలోని గడివేముల మండలం పెసరవాయి గ్రామానికి చెం దిన వడ్డు లక్ష్మీదేవి స్టేట్ అగ్రికల్చరల్ మిషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రూ. 4.7 కోట్లతో పనులు

- జలవనరులశాఖ సీఈ కబీర్‌బాషా



భూమి పూజలో పాల్గొన్న అధికారులు

శ్రీశైలం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్ వద్ద రూ.4.7 కోట్ల వ్యయంతో షాట్ క్రిటింగ్ పనులు చేపడతున్నట్లు జలవనరులశాఖ సీఈ కబీర్‌బాషా తెలిపారు. పనులకు సీఈతో పాటు డ్యాం ఈఈ వేణుగోపాల్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. డ్యాం ఫ్లడ్ క్రంటోల్ రూమ్ కొండపై నుంచి వ్యూ పాయింట్ కాన్ఫరెన్స్ హాలు వరకు 12వేల చదరపు మీటర్లు పనులు చేపట్టనున్నారు. సీఈ మాట్లాడుతూ వర్షాకాలంలో పైనుంచి బండరాళ్లు జారిపడకుండా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ చేసిన అనంతరం పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు.

శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేత



శ్రీశైలం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం రేడియల్ క్రస్ట్‌గేట్లను మంగళవారం రాత్రి ఇంజనీర్లు మూసివేశారు. ఎగువ పరివాక ప్రాంతాలైన జూరాల, విద్యుదుత్పత్తి కేంద్రాలు, సుంకేసుల నుంచి మొత్తం 1,11,883 క్యూసెక్యుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం డ్యాం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6గంటల సమయానికి 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 205 టీఎంలుగా నమోదు అయింది. శ్రీశైలం రెండు విద్యుత్ క్రేందాల్లో ఉత్పత్తి అనంతరం 66,568 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఆ నలుగురు..

- ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక
- జిల్లా నుంచి నలుగురికి అవకాశం



లక్ష్మయ్య



వెంకటసుబ్బయ్య



శేషఫణి



షేక్ మగ్బుల్‌బాషా

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేసింది. పాములపాడు మండలం కె.బనకచర్ల జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ మగ్బుల్ బాషా, నంద్యాల నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్‌ఏ గణిత ఉపాధ్యాయుడు పి.వెంకటసుబ్బయ్య, పాణ్యం మండలం బలపనూరు జడ్పీ హైస్కూల్ ఎస్‌ఏ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శేషఫణి, చాగలమర్రి బాలికల జడ్పీ హైస్కూల్ ఎస్‌ఏ తెలుగు ఉపాధ్యాయుడు వి.లక్ష్మయ్యలు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరంతా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల 5వ తేదీన విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా అవార్డులను అందుకుంటారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. బాలల కోసం స్నేహపూర్వక పథకం-2024పై స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో బుధవారం జరిగిన ఓ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణకు సంబంధించి ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టి బాలల హక్కులను రక్షించాలని పిలుపునిచ్చారు. వికలాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా మాట్లాడుతూ వైకల్యాలతో ఉన్న బాలలకు అవసరమైన వైద్య చికిత్సను అందించడానికి తాము కృషి చేస్తామని తెలిపారు. నంద్యాల అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్‌తో సమన్వయం చేసుకుని బాలలకు అవసరమైన చికిత్స, మందులను అందజేసేందుకు తాము చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బాలలకు ఏమైనా సమస్యలు ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు ఫోన్ చేయాలని కోరారు. బడికి వెళ్లని పిల్లలను గుర్తించి వారికి జిల్లా పరిషత్ పాఠశాలలో చేర్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి, డీఈఓ శామ్యూల్ పాల్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు, ప్రభుత్వ అబ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ హుశేన్ బాషా, కర్నూలు డైస్ సెంటర్ మేనేజర్ ఇర్ఫాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రతి ఇంటికీ కొళాయి

● కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ లక్ష్యసాధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్‌మిషన్, స్వచ్ఛభారత్ మిషన్ పథకాల అమలుపై బుధవారం ఢిల్లీ నుంచి డీడీడబ్ల్యూఎస్ సెక్రటరీ సుమిత్‌జా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు, బండిఆత్మకూరు, రుద్రవరం తదితర మండలాల ఎస్టీ కాలనీలలో నీటి సరఫరాకు సంబంధించి 31 పనుల ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. నీటి సరఫరా చేసే పైప్‌లైన్‌లు పంపింగ్ నుంచి ఇంటి వరకు ఎక్కడా లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయితీల్లో క్లోరినేషన్ సిస్టమ్ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

పరిశ్రమలు పెట్టుకునే వారికి ప్రోత్సాహం

డోన్ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నూతనంగా పరిశ్రమలు పెట్టుకునే నిరుద్యోగ యువతకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహబూబ్ బాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని డోన్ పరిశ్రమల శాఖ కార్యాలయం ప్రాంగణంలో యువతీ యువకులకు నూతన పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. మహబూబ్ బాషా మాట్లాడుతూ నూతన పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులలో లోన్ ఎలా పొందాలి.. ఏయే పరిశ్రమలు పెట్టుకోవాలి.. అనుమతుల కోసం ఏ విధంగా అధికారులను సంప్రదించాలి.. పరిశ్రమలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, తదితర అంశాలను వివరించారు. అలాగే ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంటు జనరేషన్ ప్రోగ్రాం స్కీం గురించి తెలియజేశారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, ఏపీఎం బాబురావు, కన్సల్టెన్సీ అధికారి కృష్ణమూర్తి, డోన్ పరిశ్రమల అభివృద్ధి అధికారి శివప్రసాద్ పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల్లో అక్రమాలకు చెక్

- మొబైల్ బుక్ కీపింగ్ యాప్‌తో పారదర్శకత
- ఆర్థిక స్వావలంబనకు ముందడుగు

ఇకపై స్వయం సహాయక సంఘాల్లో అక్రమాలకు అవకాశమే లేదు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ బుక్ కీపింగ్ యాప్ 2.0ను అందుబాటులోకి తీసుకు రానుంది. ప్రతినెలా గ్రూప్ లీడర్ల సమక్షంలో జరిగే సమావేశాలను ఇందులో పొందుపరుస్తారు. పొదుపు, రుణాల చెల్లింపులు నమోదు చేస్తారు. ప్రతి సభ్యురాలు తన మొబైల్ యాప్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యేడాది మార్చి నుంచి సంఘాల పొదుపు, బ్యాంకు రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలన్నింటినీ ఈ యాప్‌లో నమోదు చేస్తారు.



హాలహర్వి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల్లో ఇప్పటి వరకు పలు అక్రమాలు జరిగాయి. సంఘాల లీడర్ల నుంచి వెలుగు సిబ్బంది సైతం చేతివాటం ప్రదర్శించిన సంఘటనలు అనేకం చూశాం. మహిళల నిరక్షరాస్యత, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బ్యాంకుల్లో రుణాలకు చెల్లించాల్సిన డబ్బును మింగేస్తున్న వారికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కొత్త యాప్‌తో శ్రీకారం చుట్టింది. మొబైల్ బుక్ కీపింగ్ సరికొత్త యాప్‌తో ప్రతి సంఘం లావాదేవీలతో పాటు సమావేశంలో నీటిని సులభతరంగా తెలుసుకునే విధంగా అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో 32,045 సంఘాలు ఉన్నాయి. అందులో 3,20,450 మంది సభ్యులు ఉన్నారు. ప్రతిసారి ప్రతి సంఘం రూ.10 లక్షల కంటే మించి రుణాలు తీసుకుంటున్నారు. సంఘాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు, చెల్లింపుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ బుక్ కీపింగ్ యాప్ 2.0ను తీసుకొచ్చింది. ప్రతినెలా గ్రూప్ లీడర్ల సమక్షంలో జరిగే సమావేశాలను ఇందులో పొందుపరిచి పొదుపు, రుణాల చెల్లింపులు ఇందులో నమోదు చేస్తారు. దీంతో ప్రతి సభ్యురాలు వారి వారి మొబైల్ యాప్ ద్వారా ప్రతి సభ్యురాలు తెలుసుకోవచ్చు.

- తెలుసుకోవడం ఇలా...

స్వయం సహాయక సంఘాల్లో యాప్ నమోదైన అనంతరం ప్రతి సభ్యురాలికి ఒక ఐడీ కేటాయిస్తారు. ఐడీ నంబర్ ద్వారా ఆర్థిక లావాదేవీలు సులభంగా తెలుసుకోవచ్చు. వెలుగు సిబ్బంది ప్రతి నెలా పొదుపు, రుణ చెల్లింపులు బ్యాంకులో జమ చేయాలి. వారు బ్యాంకులో జమ చేశారో.. లేదో.. యాప్ ద్వారా సులువుగా ఫోన్‌లోనే తెలుసుకునే అవకాశం కల్పించారు. పూర్తి వివరాలతో వాయిస్ మెసేజ్ రావడం విశేషం.

- అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయవచ్చు

ఈ యేడాది మార్చి నుంచి స్వయం సహాయక సంఘాల పొదుపు, బ్యాంకు రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి తదితర రుణాలన్నింటినీ మొబైల్ బుక్ కీపింగ్ 2.0 యాప్‌లో నమోదు చేస్తారు. వాటి ఆధారంగా ఈ యేడాది ఏప్రిల్ నుంచి ప్రతి నెలా కొనసాగిన లావాదేవీలు ఈ యాప్‌లో కనిపిస్తాయి. చెల్లింపు విషయంలో తేడాలుంటే మొబైల్ యాప్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు.

ఈ యాప్ ఎంతో మేలు



మొబైల్ బుక్ కీపింగ్ 2.0 యాప్ ఎంతో మేలు. హాలహర్వి మండలంలో 814 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 8140 సభ్యులు ఉన్నారు. మా పొదుపు సంఘాల లావాదేవీలన్నింటినీ ఇంట్లోనే మొబైల్ యాప్ ద్వారా సమాచారం తెలుసుకుంటాం. చెల్లించిన రుణాలు సక్రమంగా ఉన్నాయా లేదోనని సభ్యులు సైతం తెలుసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా అక్రమాలకు చెక్‌పెట్టారు.

- రోజాబీ, గూళ్యం గ్రామం, హాలహర్వి మండలం

యాప్ ద్వారా పలు ప్రయోజనాలు



ప్రభుత్వం పొదుపు సంఘాల్లో అవకతవకలు జరగకుండా మొబైల్ బుక్ కీపింగ్ 2.0 యాప్ ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయి. ప్రస్తుతం సంఘాల సభ్యులకు రుణాలు చెల్లింపు విషయంలో అభ్యంతరం లేకుండా ఈ యాప్‌లో చూసుకోవచ్చు. అక్రమాలు జరిగితే వెంటనే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే జిల్లా అధికారులకు సమాచారం వెళ్తుంది. ఈ యాప్ వినియోగంపై అందరికీ శిక్షణ ఇచ్చాం.

- నాగార్జున, వెలుగు ఏపీఎం, హాలహర్వి మండలం

కేంద్రీయ విద్యాలయం పనుల పరిశీలన

డోన్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో త్వరలో తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సినటువంటి మౌలిక వసతులను మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ బుధవారం పరిశీలించారు. రైతుమిత్ర కాలనీ నుంచి ప్రధాన గేటును ప్రారంభించుటకు కావాల్సిన సదుపాయాలను మున్సిపల్ డీఈ, ఏఈలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మాలిక్, మున్సిపల్ డీఈ రఘు, ఏఈ సురేష్ ఉన్నారు.

కత్తితో యువకుడు హల్‌చల్

గడివేముల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలకలగూడురు గ్రామంలో బుధవారం ఓ యువకుడు కత్తితో హల్‌చల్ చేశాడు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డు చెప్పిన వారిపై కత్తితో బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ప్రజలు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి యువకుడిపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఆకతాయిలు పెటరేగిపోతున్నారని వారు పోలీసులకు తెలిపారు. విద్యార్థినులు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఆయితాయిల ఆగడాలను అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డిని వారు కోరారు.

7న సంపూర్ణ చంద్రగ్రహణం

- అహోబిలం ఆలయం మూసివేత

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఈనెల 7న అహోబిలం పుణ్యక్షేత్రంలో అన్ని ఆలయాలు మూసివేయనున్నట్లు ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి బుధవారం తెలిపారు. ఎగువ, దిగువ నరసింహస్వామి ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు మూసివేసి సోమవారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ చేస్తామన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీశైలం డ్యాం ఇన్‌చార్జి ఎస్‌ఈగా బాలచంద్రారెడ్డి



శ్రీశైలం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం ఇన్‌చార్జి ఎస్‌ఈగా బి.బాలచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈయన కర్నూలు జలవనరుల శాఖ ఎస్‌ఈ ఐజీ సర్కిల్‌లో పనిచేస్తారు. ఈనెల 4న బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది. కాగా శ్రీశైలం డ్యాం ఎస్‌ఈగా పనిచేసిన శ్రీరామచంద్రమూర్తి గత నెలలో పదవీ విరమణ పొందిన విషయం విదితమే.

కరువు నేలకు కన్నీళ్లు!

(5వ పేజీ తరువాయి)

ఆయకట్టుకు అందని సాగునీరు



పందికోన జలాశయం కుడి ప్రధాన కాలువకు 140 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పంట కాలువలు అసంపూర్తిగా ఉండడంతో చెరువులు నింపుతున్నారే తప్ప ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ప్రధానంగా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, కరివేముల, ప్యాలకుర్తి, తెర్నేకల్లు, ఉమ్మరాళ్ల, మాచాపురం, కొత్తపేట, ఈదుల దేవరబండ, దుప్పనగుర్తి, గోనెగండ్ల మండలంలో ఎర్రబాడు గ్రామాలకు సాగునీరు అందాలి. ప్రధాన కాలువలో నీటి ప్రవాహం ఉన్నా.. పొలాలకు మళ్లించుకోలేని దుస్థితి. రూ.210 కోట్లు ఇస్తే 45వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందు తుంది.. నిధులు ఇవ్వండని ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కుప్పంకు నీళ్లు తీసుకెళ్లాలని ప్రధాన కాలువ విస్తరణకు రూ.3,500 కోట్లు వెచ్చించిన పాలక పెద్దలు కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసలు నివారించేందుకు రూ.210కోట్లలో అసంపూర్తి కాల్వలు పూర్తి చేయకపోవడం ఇదెక్కడి న్యాయం..? అంటూ కరువు రైతులు ప్రశ్నిస్తున్నారు.

మొదలైన జల జగడాలు

కృష్ణా జలాలు పల్లె చెంతకు చేరాయి.. డిస్ట్రిబ్యూలరీలు, పిల్ల కాలువలు లేకపోవ డంతో రైతులు మోటార్ల ద్వారా పొలాలకు మళ్లిస్తున్నారు. అక్కడక్కడ కాలువకు అడ్డంగా వేసి నీటిని మళ్లిస్తుండడం, దిగువ రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుం డడంతో పలు గ్రామాల్లో జల జగడాలు మొదలయ్యాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో జల జగడాలు ఎక్కడికి దారితీస్తాయో అని దేవనకొండ మండలానికి చెందిన ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు నిర్మిస్తే ఈ పరిస్థితి ఉండదని అంటున్నారు.

పిల్ల కాలువలు ఏవీ?

పత్తికొండ రిజర్వాయకు కుడి కాలువ కింద మద్దికుంట, దేవనకొండ పెద్ద చెరువు, చిన్న చెరువు, కొత్తపేట, ఓబులాపురం చెరువు, కరివేముల, ఎర్రబాడు పాత చెరువు, కొత్తచెరువు, మాచాపురం చెరువులను నింపుతున్నామని ఇంజనీర్లు తెలిపారు. చెరువులు సరే.. ఆయకట్టుకు సాగునీరు అందించే పిల్ల కాలువ పరిస్థితి ఏమిటీ..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. పత్తికొండ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్‌లు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రూ.210 కోట్లు మంజూరు చేయించి అసంపూర్తి డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు పూర్తిచేయాలని, లేదంటే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువ పరిధిలో పిల్ల కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, రోడ్ క్రాసింగ్ బ్రిడ్జిలు అసంపూర్తిగా ఉన్నమాట నిజమే. ఈ పనులకు రూ.210 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. రిజర్వాయర్ నుంచి 140 క్యూసెక్కులు విడుదల చేసి, చెరువులు నింపుతున్నాం.

● పాండురంగయ్య, ఎస్‌ఈ, హంద్రీ-నీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్

అక్రమ ఎరువుల నిల్వపై కేసు నమోదు

పాణ్యం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఎరువుల నిల్వపై కేసు నమోదు చేసినట్లు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం పాణ్యంలో విలేకరులతో మాట్లాడుతూ గత నెల 28 వ తేదీన గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన ఆర్ బ్రహ్మానందంరెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 7.705 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసిన సంఘటనలో బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గడివేముల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎరువులను అధిక ధరలకు అమ్మితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వినాయకా.. సెలవిక..!

- నేడు కర్నూలులో గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవం
- కేసీ కెనాల్ వినాయక ఘాట్, స్టాంటన్‌పురం కేసీ కెనాల్ వద్ద ఏర్పాట్లు
- రెండువేల మందితో పోలీస్ భద్రత



కర్నూలు కల్చరల్/ కర్నూలు క్రైం,/కర్నూలు అర్బన్/ కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో వినాయక చవితి వేడుక మొదలు, గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటూ భక్తుల పూజలు అందుకున్న గణనాథుడు గురువారం 'ఇక సెలవంటూ...' వీడ్కోలు పలుకుతున్నాడు. నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆబాలగోపాలాన్ని అలరింపజేసిన గణపతయ్య గంగమ్మ తల్లి ఒడికి చేరుకోనున్నాడు. నగరంలో 'గణేశ్ నవరాత్రి ఉత్సవాలు' గురువారం నాడు ముగియనుండగా, ఉత్సవ విగ్రహాలను నగర నడిబొడ్డున గల కేసీ కెనాల్ ఒడ్డున గల వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేస్తున్నారు. గత 45 ఏళ్లుగా ఈ నిమజ్జనోత్సవాన్ని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో, ఏటా నగర గణేశ్ మంటపాల నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. కాగా ఈ ఏడాది కూడా ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. గణేశ్ నిమజ్జనోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్ కేసీ కెనాల్ ఘాట్ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లాకు చెందిన రెవెన్యూ, విద్యుత్తు, నీటిపారుదల, మత్స్య, వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులు కేసీ కెనాల్, వినాయక ఘాట్ వద్ద తగిన ఏర్పాట్లు చేశారు.

● నాలుగు ప్రాంతాల నుంచి విగ్రహాల ఊరేగింపు...



నగరంలో మొదటగా ఉదయం 9 గంటలకు పాత నగరం నుంచీ విగ్రహాల ఊరేగింపు ప్రారంభిస్తారు. ఈ ఊరేగింపు రాజ్ విహార్ మీదుగా వినాయక్ ఘాట్ బయల్దేరుతుంది. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బళ్లారి చౌరస్తా నుంచీ విగ్రహాల ఊరేగింపు మొదలవుతుంది. ఇది మొదటి ఊరేగింపుతో రాజ్ విహార్ వద్ద కలుసుకొని ఘాట్‌కు బయల్దేరుతుంది. మూడో ఊరేగింపు మధ్యాహ్నం 2 గంటలకు కల్లూరు చౌరస్తాలో మొదలై క్రిష్ణనగర్ మీదుగా బిర్లా సెంటర్ నుంచీ ఘాట్‌కు చేరుతుంది. నాలుగో ఊరేగింపు మధ్నాహ్నం 2 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు నుంచీ ప్రారంభమై బిర్లా సెంటర్ మీదుగా కేసీ కెనాల్ ఘాట్‌కు చేరుకుంటాయి.

● పాతనగరం నుంచి ఊరేగింపు



జిల్లా యంత్రాంగం, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు శ్రీరాంభొట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహ మంటపం వద్ద పూజలు చేసి ఊరేగింపు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, భాగ్యనగర్ గణేశ్ మహోత్సవ సమితి గౌరవాధ్యక్షుడు జి. రాఘవరెడ్డి పాల్గొని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డాక్టర్ బి. నవ్య, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పాలొంటారు. పాతనగరంలోని వివిధ ప్రాంతాల నుంచీ గణనాథుడి ఉత్సవ విగ్రహాలు పాతబస్టాండు మీదుగా కోట్ల సర్కిల్, కిడ్స్ వరల్డ్ రాజ్ విహార్, కలెక్టరేట్ మీదుగా కేసీ కెనాల్ వినాయక ఘాట్‌కు చేరుకుంటాయి.

భారీగా పోలీస్ బందోబస్తు



పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని, నిమజ్జనానికి 2వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు మధ్య గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేసి దిశా నిర్దేశం చేశారు. గురువారం 1200 గణేష్ విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందన్నారు. 2వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 10 డ్రోన్ కెమెరాలు, 2 వేల సీసీ కెమెరాలు నిఘా ఉంచామని, రూఫ్‌టాప్ పికెట్స్, సైక్లింగ్ పోర్సు రిజర్వు, ఎపీఎస్‌పీ పోర్సు, పుషింగ్, లిఫ్టింగ్, స్పెషల్ పార్టీ పోలీసులను బందోబస్తుకు ఏర్పాటు చేశామన్నారు. అలాగే శుక్రవారం మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అర్ధరాత్రి 12గంటల తర్వాత డీజేలకు అనుమతి లేదని, ఇందుకు నిర్వాహకులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

300 మంది కార్మికులు

నగర పాలక సంస్థ అధ్వర్యంలో గురువారం జరిగే వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని సత్యనారాయణ స్వామి ఆలయం, కొత్త అయ్యస్వామి ఆలయం, వినాయక గుడితో పాటు స్టాంటాన్‌పురం వద్ద మమతానగర్ సమీపంలోని కేసికెనాల్ వద్ద కలిపి మొత్తం ఆరు ఘాట్‌లను ఏర్పాటు చేశారు. 1,2 ఘాట్‌లను సత్యనారాయణస్వామి ఆలయం వద్ద, 3వ ఘాట్‌ను వినాయక గుడి సమీపంలో, 4,5 ఘాట్‌లను అయ్యప్పస్వామి ఆలయం వెనుక, 6వ ఘాట్‌ను స్టాంటాన్‌పురం మమతానగర్ కేసి కెనాల్ సమీపంలో ఏర్పాటు చేసి క్రేన్‌లను సిద్ధం చేశారు. ఈ మేరకు ఉద్యోగులకు విధులు కేటాయిస్తూ కమిషనర్ పి.విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం 300 మంది పారిశుధ్య కార్మికులను అందుబాటులో ఉంచారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా :



వినాయక ఘాట్‌లో బోట్లు సిద్ధం చేసిన మత్స్యశాఖ అధికారులు

- ఆర్టీసీ బస్టాండు నుంచి రాజ్ విహార్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి, వినాయక ఘాట్, గాయత్రీ ఎస్టేట్ వరకు ఎటువంటి వాహనాలకు అనుమతులు ఉండదు. వాహనాల రాకపోకలకు నిషేదం.
- కర్నూలు ఆర్టీసీ బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను బళ్లారీ చౌరస్తా మీదుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్, గుత్తి పెట్రోల్ బంక్, బిర్లా జంక్షన్, మద్దూరు నగర్ సర్కిల్, సీ.క్యాంపు మీదుగా నంద్యాలచెక్‌పోస్టు వైపు వాహనాలు రాకపోకాలు సాగించాలన్నారు.
- ఆత్మకూరు, నంద్యాల, నందికొట్కూరు, నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి నగరంలోనికి వచ్చే వాహనాలు సీ.క్యాంపు, బిర్లాగేటు, గుత్తి పెట్రోల్ బంకు నుంచి కల్లూరు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీస బస్టాండుకు చేరుకుంటాయి.
- హైదరాబాదు గద్వాల, అలంపూరు నుంచి వచ్చే వాహనాలు తుంగభద్ర బ్రిడ్జి సంతోష్‌నగర్, బళ్లారి చౌరస్తా మీదుగా కర్నూలు ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయి.
- అనంతపురం, డోన్ నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండు చేరుకుంటాయి.
- నిమజ్జనం పూర్తయిన తర్వాత నిమజ్జన వాహనాలు దేవనగర్ మీదుగా కృష్ణానగర్, కల్లూరు బ్రిడ్జి మీదుగా బయటకు వెళతాయి.

నేడు మద్యం దుకాణాలు బంద్

వినాయక విగ్రహాల నిమజ్జనం పురస్కరించుకుని గురువారం కర్నూలు నగరంలో మద్యం దుకాణాలను మూసి వేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ చంద్రహస్ ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన ప్రాంతాల్లో దుకాణాలు తెరుచుకోవచ్చన్నారు.



గాంధీనగర్‌లో పూజలకు హాజరైన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

మతసామరస్యానికి ప్రతీకగా
గణేశ్ ఉత్సవాలు

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్నూలులో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం ఆయన నగరంలోని గాంధీనగర్‌లో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో పూజలు నిర్వహించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ వినాయకుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండప నిర్వాహకులు శ్రీధర్ బాబు, మల్లయ్య, ఆర్వేటి ప్రవీణ్, రాఘవేంద్ర, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

● **నరసింహారెడ్డి నగర్‌లో..** నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లోని వినాయక మండపం వద్ద కార్పొరేటర్ ఎన్. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత ఎంతో ఉత్సాహ వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కమిటీ సభ్యులు శ్రీధర్, భరత్, రాహుల్, విజయ్, కిరణ్, ప్రేమ్, శ్రీను, సాయి శ్రీను, రాము, డీజే సాయి, మహేశ్ పాల్గొన్నారు.

గణపతి మండపాల్లో పెరిగిన సందడి

గణపతి మండపాల్లో 8వ రోజు భక్తుల సందడి పెరిగింది. గురువారం వినాయకుడిని నిమజ్జనోత్సవానికి తరలిస్తుండగా, చివరిరోజు మండపాల వద్ద పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. గాంధీ టవర్స్‌లోని మండపం వద్ద విద్యార్థులకు సామూహిక సరస్వతి పూజలు చేపట్టారు. పాతనగరంలోని పెద్ద మార్కెట్ వద్ద ఎల్కూరు గేట్ వద్ద ఏర్పాటు చేసిన మంటపం వద్ద కమిటీ నిర్వాహకులు కొప్పురపు లక్ష్మణ్, ఐ.శ్రీనివాసులు, రవికుమార్ రెడ్డిలు అన్నదానం చేశారు. ఈ మండపంలో కాళీయ మర్ధన, నరసింహావతార మూర్తి గణపతి దర్శనమిస్తున్నారు. పెద్ద అమ్మవారిశాల వద్ద మూషికం పడవ నడుపున్న గణనాథుడు ఆకర్షణీయంగా కానవచ్చారు. సమాచారశాఖ కార్యాలయం ఆవరణలో పాత్రికేయులు ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతి ఆకర్షిస్తున్నాడు. నరసింహారెడ్డినగర్‌లో 44వ వార్డు ఎస్‌బీఐ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీల ప్రాంతంలో బాల వినాయక సంఘం ఏర్పాటు చేసిన వ్యాసమహాముని, రుషీ సమేత వినాయకుడు ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నాడు. బుధవారం సంఘ నిర్వాహకులు పి.ప్రభాకర్‌రావు, దినేష్‌కుమార్, తేజ, శ్యామల, వనజాక్షిలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాతనగరంలో రెండో వార్డు సుబేదారి వీధిలో నరసింహమూర్తి గణపతి భక్తులను అలరిస్తున్నాడు.



గాంధీటవర్స్ అపార్ట్‌మెంట్‌లో సరస్వతి పూజ



నగరంలో కొలువు దీరిన వినాయకుడు



నరసింహారెడ్డి నగర్‌లో వినాయకుడి వద్ద భక్తులు

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి

- తల్లికి, పెద్ద కుమారుడికి గాయాలు



విజయుడు, ప్రసాద్ (ఫైల్)

ప్యాపిలి సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపూదిల్ల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందారు. వివరాలివీ.. ప్యాపిలి మండలం చిన్నపూదిల్ల గ్రామానికి చెందిన విజయుడు(50), లక్ష్మీదేవి దంపతులకు పెద్దకుమారుడు రవి, చిన్న కుమారుడు ప్రసాద్(25). విజయుడు వ్యవసాయ పనులు చేసుకుని జీవనం చేసేవారు. చిన్న కుమారుడు ప్రసాద్ ప్యాపిలిలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. తండ్రి విజయుడు, చిన్న కుమారుడు ప్రసాద్ ఒక బైకుపై, తల్లి లక్ష్మీదేవి, పెద్దకుమారుడు రవి ఒక బైకుపై పని నిమిత్తం బుధవారం బైకుపై ప్యాపిలికి బయలు దేరారు. అయితే మార్గమధ్యంలోని పెద్దపూదిల్ల గ్రామ సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న వాహనం వీరి బైకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. విజయుడు, రవి తీవ్రంగా గాయపడగా.. లక్ష్మీదేవి స్వల్పంగా గాయపడ్డారు. వీరందరినీ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే విజయుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామం సమీపంలో బుధవారం బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందాడు. బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాలివీ.. కర్నూలు వద్ద ఉన్న భూపాల్ నగర్‌కు చెందిన మహబూబ్ బాషా(32) నందికొట్కూరు వైపుగా వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

కర్నూలు క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బళ్లారి చౌరస్తా సమీపంలోఉన్న సూరజ్ గ్రాండ్ హోటల్ సమీపంలో విద్యుత్‌ఘాతానికి గురై రామ్మోహన్ (56)అనే వ్యక్తి మృతి చెందాడు. కర్నూలు నగరంలోని సున్నంవీధికి చెందిన ఈయన 25 ఏళ్లుగా ఎస్‌ఎల్‌వీ కేబుల్ నెట్‌వర్క్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గణేష్ నిమజ్జనం సందర్భంగా కేబుల్ వైర్లు అడ్డు లేకుండా చూసేందుకు బుధవారం సాయంత్రం బళ్లారి చౌరస్తా సమీపంలో ఉన్న సూరజ్ గ్రాండ్ హోటల్ పక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఎక్కాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి కింద పడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య మంజుల, కుమారుడు, కుమార్తె సంతానం.

నీటి కుంటలో పడి..

ఆలూరు(చిప్పగిరి), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిప్పగిరికి చెందిన ఓ వ్యక్తి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతి చెందాడు. వివరాల మేరకు.. గ్రామానికి లక్ష్మన్న, లక్ష్మీదేవి వేపమాను సోమశేఖర్(31) సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే పనికి వెళ్లాడు. తర్వాత మరుగుదొడ్డికి వెళ్లిన సోమశేఖర్ ఎంతసేపటికీ తిరిగి రాలేదు. అక్కడున్న కూలీలు, కుటుంబ సభ్యులు గాలించారు. నీటికుంట వద్దకు వెళ్లినట్లు తెలియడంతో బంధువులు, గ్రామస్తులు గుంతలో దిగి గాలించగా సోమశేఖర్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య కళ్యాణితోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వ్యక్తి దారుణ హత్య

ఆస్పరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోగల్‌గల్ గ్రామంలో ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలివీ.. మండలంలోని తోగల్‌గల్ గ్రామానికి చెందిన అహోబిలం(33) బుధవారం భార్య గంగమ్మ, ఇద్దరు పిల్లలు పుట్టినిల్లు అయిన కలపరి గ్రామానికి వెళ్లారు. సాయంత్రం అహోబిలం తోగల్‌గల్‌కు తిరుగు పయనమయ్యాడు. దొడగొండ సమీపంలో దుండగులు గొంతు కోసి రోడ్డు సమీపంలో పడేశారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అహోబిలం అనే వ్యక్తికి భార్య గంగమ్మతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అన్ని కోణాలు దర్యాప్తు చేస్తున్నామని, తోగల్‌గల్ ఫ్యాక్షన్ గ్రామం కావడంతో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని సోమప్పనగర్‌కు చెందిన బోయ వీరేంద్ర (19) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ ఏఎస్‌ఐ కిష్టప్ప తెలిపిన వివరాలివీ.. వీరేంద్ర తండ్రితో పాటు ఆటో నడుపుతూ జీవిస్తున్నారు. వీరేంద్ర తల్లిదండ్రులు దైవ దర్శనం కోసం అరుణాచలం వెళ్లారు. ఇంట్లో అవ్వ, తమ్ముడు నిద్ర పోతున్న సమయంలో అర్ధరాత్రి వీరేంద్ర అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులకు అనుమానం ఉన్నట్లు చెప్పారని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి

9న రైతాంగ సమస్యలపై నిరసన

వైసీపీ కర్నూలు, నంద్యాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని రైతులకు వెంటనే అందించాలని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న నంద్యాల జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రైతు సమస్యలపై రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయడం లేదని, దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, గిట్టుబాటు ధర అందించడంలో విఫలం చెందిందన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల్లోనే రైతులకు గిట్టుబాటు కల్పించి పంటలు కొనుగోలు చేసేదన్నారు. రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పొగాకు, మామిడి, మిర్చి, టమోటా, ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని విమర్శించారు.



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల ఇక్కట్లు, రైతుల సమస్యలపై ఈ నెల 9న వైసీపీ నిరసన చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యూరియా కొరతతో రైతులు రోడ్డు ఎక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో టీడీపీ నాయకులు రేషన్ బియ్యం, ఇసుక మద్యాన్ని వ్యాపారంగా చేసుకున్నారని, చివరకు యూరియాపై కూడా కమీషన్ కోసం రైతులను వేధిస్తున్నారని అన్నారు. సమావేశంలో కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, కార్పొరేటర్లు ఎస్‌టీ షేక్ అహ్మద్, జుబేర్ అహ్మద్, నాయకులు తెర్నేకల్ సురేంద్రరెడ్డి, షరీఫ్, కిషన్, కంఠూ పాల్గొన్నారు

నర్సింగ్ విద్యార్థిని లాక్కెళ్లిన మహిళ



నర్సింగ్ విద్యార్థిని లాక్కెళ్తున్న మహిళ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ టికెట్ కోసం ఓ మహిళ జీఎన్ఎం స్టూడెంట్ షర్ట్ కాలర్ పట్టుకుని లాక్కెళ్లడం కలకలం రేపింది. హాస్పిటల్ ఓపీ కావాలంటే ఆధార్ తప్పనిసరిగా ఉండాలి. బుధవారం హాస్పిటల్‌కు వచ్చిన ఓ మహిళ ఓపీ ఇవ్వాలని నర్సింగ్ స్టూడెంట్‌ను కోరింది. ఆధార్ అప్‌డేట్ కాలేదని టోకెన్, ఫోన్ తెచ్చుకోవాలని నర్సింగ్ స్టూడెంట్ చెప్పింది. ఫోన్‌లో ఓటీపీ నెంబర్ వచ్చిందని, అది చెబితే ఓపీ ఇస్తారని చెప్పింది. ఫోన్ తన దగ్గర లేదని, భర్త దగ్గర ఉందని మహిళ చెప్పింది. ఓపీ కోసం వస్తే ఇక్కడికి.. అక్కడికి వెళ్లాలని తిప్పుతున్నారని రోగి ఆగ్రహంతో నర్సింగ్ స్టూడెంట్ కాలర్ పట్టుకుని లాక్కెళ్లింది. దీంతో నర్సింగ్ విద్యార్థులు, రోగులు మహిళను అడ్డుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ డా.కిరణ్ కుమార్, ఔట్‌పోస్టు పోలీసుల సహకారంతో ఘటన స్థలానికి చేరుకుని సమస్యను సర్దుబాటు చేశారు. హాస్పిటల్ అధికారులు ఓపీ కోసం వచ్చే రోగుల ఇబ్బందులు పడకుండా నివారణ చర్యలు చేపట్టలని కోరుతున్నారు.

వెల్దుర్తిలో డెంగీ పంజా

- చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులు
- ఇటీవలే బాలిక మృతి
- 15 రోజుల్లో మొత్తం 9 కేసులు

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డెంగీ కేసులు నమోదు కావడం కలకలం రేపుతోంది. స్థానిక సీహెచ్‌సీలో మూడు కేసులు నమోదయ్యాయి. పట్టణంలో మూడు రోజుల క్రితం ఒకరు, మంగళవారం ఒకరు, బుధవారం మరొకరు ఆసుపత్రిలో చేరినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. పదిహేను రోజుల్లో 9 కేసులు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధుల నిర్వహణపై సమీక్ష

గూడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధుల నిర్వహణపై జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి జి.నాసరరెడ్డి సమీక్ష నిర్వహించారు. బుధవారం గూడూరు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆడిట్ అబ్జెక్షన్లు, ఈ ఆఫీసు నిర్వహణ, కార్యాలయ సంబంధిత రికార్డుల నిర్వహణ, 15వ ఆర్థిక సంఘం నిధుల నిర్వహణ అంశాలపై తనిఖీ చేసి సమీక్షించారు. ఈవోఆర్డీ మధులత, పరిపాలనాధికారి అయూబ్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ రమణమ్మ, జూనియర్ అసిస్టెంట్ అనూరాధ, టైపిస్టు మహబూబ్ బాషా పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసర రెడ్డి

హౌస్ సర్జన్లు, నర్సుల మధ్య వివాదం

- ఎఫ్ఎం-7లో ఇంజెక్షన్లు వేయకుండా నిర్లక్ష్యం
- మహిళా రోగుల ఫిర్యాదుతో విచారణ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఫిమేల్ మెడికల్-7 యూనిట్‌లో మహిళా రోగులకు మంగళవారం రాత్రి ఇంజెక్షన్ వేయలేదు. రోగులకు ఇంజెక్షన్లు వేసే విషయంలో హౌస్ సర్జన్లు, నర్సుల మధ్య వివాదం నెలకొంది. క్యాజువాల్టీలో విపరీతమైన పని ఉందని, ఇంజక్షన్లు వేయాలని మంగళవారం రాత్రి హౌస్ సర్జన్లు నర్సింగ్ సిబ్బందికి సూచించారు. అయితే ఇంజెక్షన్లు వేయడం తమ పని కాదని, ఇతర పనులు ఉన్నాయని చెప్పారు. ఇద్దరి మధ్య సమన్వయంలేకపోవడం మంగళవారం రాత్రి ఎఫ్ఎం-7 యూనిట్‌లోని మహిళ రోగులకు ఇంజెక్షన్లు వేయలేదు. బుధ వారం ఉదయం వార్డుకు వచ్చిన మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు తమకు రాత్రి ఇంజెక్షన్లు వేయలేదని రోగులు ఫిర్యాదు చేశారు. దీంతో యూనిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి విచారించారు.



మహిళల మెడికల్ వార్డులో విచారిస్తున్న అధికారులు

మహిళ ఆత్మహత్య

గూడూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చనుగొండ్ల గ్రామానికి చెందిన మంజుల (22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ చిరంజీవి తెలిపిన మేరకు వివరాలివీ.. గోనెగండ్ల గ్రామానికి చెందిన మంజులకు గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన మనోహర్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే గత కొన్ని రోజులుగా మంజుల కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఉరి వేసుకుంది. మంజుల సోదరుడు వీరన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మొక్కజొన్న పంటలు ధ్వంసం

- అడవి పందుల దాడి నుంచి కాపాడాలని రైతుల వినతి



పంటను చూపుతున్న రైతు నాగన్న

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లకాలువ గ్రామశివార్లలో నాగయ్య, ప్రకాశం అనే రైతులకు చెందిన పంట పొలాల్లో మంగళవారం రాత్రి అడవి పందులు పంటపై దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. సుమారు 4 ఎకరాల్లో కంకి దశలో ఉన్న పంటను తాము నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ పంటలకు అడవి పందుల బారి నుంచి రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు అడవి పందులు తమ పంట పొలాల్లోకి రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అడవి పందుల వల్ల నష్టపోయిన తమ పంటలను అటవీ అధికారులు తక్షణమే పరిశీలించి, నష్టపోయిన తమ పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

యూరియాపై ఆందోళన వద్దు

● వ్యవసాయశాఖ ఏడీఏ గిరీష్



మాట్లాడుతున్న నందికొట్కూరు ఏడీఏ గిరీష్

నందికొట్కూరు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు డివిజన్‌లోని ప్రతి నెలా రైతులకు అవసరమైన యూరియాను అందజేస్తున్నామని ఏడీఏ గిరీష్ తెలిపారు. బుధవారం ఆయన విలేరులతో మాట్లాడుతూ నందికొట్కూరు డివిజన్‌లోని సాగులో ఉన్న మొక్కజొన్న, మినుము, పత్తి, వరి పంటల విస్తీర్ణానికి తగ్గట్టుగా ప్రతి నెలా దశల వారీగా యూరియాను సరఫరా చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు పగిడ్యాల (730.56 మెట్రిక్ టన్నులు), మిడ్తూరు (545 మెట్రిక్ టన్నులు), జూపాడుబంగ్లా (748.16 మెట్రిక్ టన్నులు), నందికొట్కూరు (2014.337 మెట్రిక్ టన్నులు) మొత్తం నాలుగు మండలాలకు 4,038.67 మెట్రిక్ టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేశామని ఆయన వివరించారు.

యూరియా కొరత ఉంది

నందికొట్కూరు నియోజకవర్గంలో యూరియా కొరత అధికంగా ఉందని తాను ప్రధానమంత్రి కార్యాలయానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. దీంతో సీఎం చంద్రబాబు నేడు జిల్లా కలెక్టర్ల టెలికాన్ఫరెన్సులో నందికొట్కూరులో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారికి సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ నందికొట్కూరులో యూరియా ఏ మేరకు అవసరం అవుతుందో తెలియజేయాలని ఏడీఏను టెలికాన్ఫరెన్సులో ఆదేశించారన్నారు. నందికొట్కూరు డివిజన్‌కు ప్రస్తుతం 600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవు తుందని ఇండెంట్ ఇచ్చామని కలెక్టర్ సూచించారని తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో యూరియా నందికొట్కూరు వస్తుందని నందికొట్కూరు ఏవో షేక్షావలి తెలిపారు.

రేపు 2040 మెట్రిక్ టన్నుల యూరియా

పాణ్యం: పాణ్యం మండలానికి ఈనెల 5వ తేదీన 2040 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని ఏవో జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు యూరియా పొందాలన్నారు.

అవసరం మేరకు యూరియా పంపిణీ

గోస్పాడు: రైతులకు అవసరం మేరకు యూరియా పంపిణీ చేస్తామని ఏవో స్వప్నిక తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో ఇప్పటివరకు 6,510మెట్రిక్ టన్నుల యూరియా, 832 మెట్రిక్ టన్నుల డీఏపీని పంపిణీ చేసినట్లు ఆమె వివరించారు.

గడివేముల: రైతులకు అందుబాటులో యూరియా ఉంటుందని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వార యూరియాను రైతులకు అందుబాటులో ఉంచుతామని అన్నారు.

మహానంది: మరో రెండు రోజుల్లో యూరియా పుష్కలంగా వస్తుందని మహానంది ఏవో బి. నాగేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 5న 2600 మెట్రిక్ టన్నులు, 10వ తేదీన 2600 మెట్రిక్ టన్నులు, 13న 1500 మెట్రిక్ టన్నుల యూరియా నంద్యాల జిల్లాకు వస్తుందన్నారు.

ఆత్మకూరు: యూరియా లభ్యతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆత్మకూరు ఏడీఏ హేమలత, తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని మన గ్రోమోర్, శివా ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఎరువుల స్టాక్ వివరాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈనెల 4 నుంచి జిల్లాకు 9300 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి కానుందని, ఇందులో 6120 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ ద్వారా రైతు సేవా సేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్‌ల ద్వారా అందించనున్నట్లు చెప్పారు. మిగిలిన 3180 మెట్రిక్ టన్నులను ఆయా ప్రైవేట్ ఎరువుల దుకాణాల ద్వారా రైతులకు సరఫరా చేస్తామన్నారు.

ప్రతి జీవికీ నేత్రాలు ప్రధానం

గోస్పాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భూమ్మీద నివసించే ప్రతిజీవికి నేత్రాలు ప్రధానమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అంధత్వ నివారణ కంటి వైద్యాధికారి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. 40వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా బుధవారం యాళ్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భారతి, మూర్తి, కంటివైద్య సిబ్బంది పాల్గొన్నారు.

21న మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలు

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈ నెల 21న మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరి షేక్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్, న్యూ ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఈ పోటీలు నిర్వహిస్తారన్నారు. బాడీబిల్డర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారు 9848030285కు సంప్రదించాలని ఆయన కోరారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు

మహానంది, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు యాజమాన్య పద్ధతులపై ఏవో బి. నాగేశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం బొల్లవరం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సిబ్బంది సలహాలను రైతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయాధికారి మంజుల పాల్గొన్నారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



మంత్రిని కలిసిన ఎమ్మెల్యే, దేవస్థానం కార్యనిర్వహణాధికారి

శ్రీశైలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని బుధవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, శ్రీశైల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసరావు విజయవాడ సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని స్వామివార్ల శేషవస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీశైలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహ్మద్ మియా

పాణ్యం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతిక విలువలను పెంచుకోవాలని ప్రముఖ గజల్ గాయకుడు మహ్మద్ మియా పేర్కొన్నారు. బుధవారం శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గజల్స్, పద్యాలు, ఉత్తమ నినాదాల ద్వారా ప్రేరణ, నైతిక విలువలు, మానవ సంబంధాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌వోడీ శేషయ్య, కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల గానాలాపన

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కళారాధన, నంద్యాల ఐఎంఏ, లయన్స్‌క్లబ్ సంయుక్త నిర్వహణలో జరుగుతున్న మాతృభూమికి కళార్చన పోటీలలో భాగంగా నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో బుధవారం సీనియర్ విభాగంలో నిర్వహించిన శాస్త్రీయ, జానపద, సాధారణ, దేశభక్తి విభాగాలలో సోలో, బృంద గాన పాటల పోటీలు అలరించాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీతమ్మ, లక్ష్మీకళ్యాణి వ్యవహరించారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు వద్దు : డీఎస్పీ



వెలుగోడులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వెలుగోడు సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. బుధవారం వెలుగోడు పట్టణంలోని పురవీధుల గుండా పోలీసు అధికారులు, సిబ్బందతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఒక కులాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. ఇటువంటివి మంచి పద్ధతులు కావన్నారు. ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. స్థానికులు కాకుండా స్థానికేతరులు సోషల్ మీడియాలో ఇటువంటి దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. వెలుగోడులో నిమజ్జనం సందర్భంగా చిన్న సమస్య వచ్చిందని, దీన్ని అధికారులు పరిష్కరించారన్నారు. దుష్ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. సీఐలు సురేష్ కుమార్‌రెడ్డి, రాము, వెలుగోడు ఎస్ఐ సురేష్, పాల్గొన్నారు.

రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యలు

మిడుతూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలో ప్రజలు రోగాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో సంజన్న తెలిపారు. బుధవారం డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచు జయలక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్‌సింగ్,హెల్త్ సూపర్‌వైజర్ ఏసేపు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాలువ పనులు వెంటనే చేపట్టాలి

పాములపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్దూరు గ్రామ శివార్లలోని ఎస్సార్బీసీ కాలువ పనులు వెంటనే చేపట్టాలని టీడీపీ మండల సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మద్దూరు, తూడిచెర్ల గ్రామాల మధ్య ఉన్న ఎస్సార్బీసీ కాలువ నిర్మాణ పనులను అధికారులు నిలిపి వేశారు. దీంతో ఇటీవల తుపాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు పంటల్లో నీరు నిలిచిపోయి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సేవలను గుర్తించిన టీడీపీ : నాగముని

పాణ్యం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముప్పై యేళ్లగా టీడీపీకి చేసిన సేవలను పార్టీ గుర్తించిందని టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి జె. నాగముని అన్నారు. బుధవారం టీడీపీ అధిష్టానం ప్రకటించిన ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్లలో పాణ్యం నియోజకవర్గం నుంచి నాగమునిని ఎంపిక చేయడంపై ఆయన టీడీపీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఓర్వకల్లు మండలం బైరాపురం గ్రామం రైతు కుటుంబానికి చెందిన నాగముని అడ్వకేట్‌గా కొనసాగుతు న్నారు. ఈయనకు భార్య సుజాత, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. గత 30 యేళ్లగా పార్టీలో కొనసాగుతున్నారు. 2019 నుంచి 2022 వరకు కర్నూలు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, 2008లో జిల్లా బార్ అసోసియేషన్ మెంబరుగా కొనసాగారు. ప్రస్తుత పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య గెలుపునకు తన వంతు సహకారం అందించారు. టీడీపీ కార్యకర్తలకు, పేదలకు న్యాయ సలహాలు, ఉచిత న్యాయం అందించారు. గతంలో నందికొట్కూరు ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించారు. పార్టీలో కొనసాగుతూ ప్రతిపక్షాలపై పోరాటాలు సాగించడం లో కృషి చేశారు. పార్టీ ఆదేశాల మేరకు డైరెక్టర్ పదివికి న్యాయం చేస్తానని ఆయన తెలిపారు.

ఉద్యాన సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన సాగుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఆత్మకూరు ఉద్యానవన అధికారిణి చందన పేర్కొన్నారు. బుధవారం నల్లకాలువ గ్రామంలో వెదురు, ఉల్లి ఉద్యావన పంటలను పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల నివారణతో అధిక దిగుబడులు

కొత్తపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఎలుకల నివారణతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం తెలిపారు. బుధవారం మండలంలోని శివపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగశ్రీ, రైతు సేవా కేంద్ర సిబ్బంది అరుణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

'9న రైతు పోరుకు తరలిరండి'

నందికొట్కూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాంలో యూరియా అందించాలంటూ ఈనెల 9వ తేదీన చేపట్టను న్న రైతు పోరు కార్యక్రమాన్ని రైతులు పెద్దఎత్తున తరలిరావాలని నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ దారా పిలుపుని చ్చారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

'ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి'

నందికొట్కూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు పూటగడవడం కష్టంగా మారిందని, వారికి ఉపాధి కల్పిం చాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురాంమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వ హించారు. ఆటో డ్రైవర్లకు ప్రతినెలా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిం చాలని, కార్మికులకు సంక్షే బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ నాయకులు శివ, వీరస్వామి, రవికుమార్, సాయి, హుస్సేన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.30 వేలు ఇవ్వడంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సద్దాం, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపా రు. సీఐటీయూ నాయకులు రణధీర్, మల్లయ్య, రవి, శ్రీను, రమణ, బుజ్జి, సయ్యద్, బాషా, వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

పగిడ్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పగిడ్యాల గ్రామంలో ఎపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు విజేయుడు, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బుధవారం మండల నూతన కమిటీని ఎనుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రమణ, ఉపాధ్యక్షు డిగా రవి, ప్రధాన కార్యదర్శిగా రాజు, మండల కార్యదర్శిగా విజయుడులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిలేటి, శివన్న, గుండన్న తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఎల్‌డీవో

పగిడ్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది స్వామిత సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి అన్వరాబేగం హెచ్చరించారు. మండల పరిధి లోని లక్ష్మాపురం, ప్రాతకోట గ్రామాల్లో స్వామిత స్వరేలో భాగంగా సిబ్బంది చేపట్టిన ఇంటి కొలతల సర్వే కార్యక్రమాన్ని ఆమె బుధ వారం ఆమె పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

6న 'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ఆత్మకూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 6న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినప్పటికీ ఇంతవరకు విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ఆ సంఘం నాయకులు బిన్ని, మనోజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి: సీపీఐ

నంద్యాల రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డికి గుంతకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా, సీపీఎం పట్టణ కార్య దర్శులు రంగనాయుడు, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నంద్యాలలోని ఆ పార్టీ కార్యాలయాల్లో బుధవారం వారు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో సోలార్ పరిశ్రమ కోసమని గతంలో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కా ర్యదర్శి రైతులను ఆదుకోవాలని పర్యటనకు వెళ్లడంతో ఆయనను ఎమ్మెల్యే దూషించడం దుర్మార్గమన్నారు.

ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా వెంకటేశ్



పాణ్యం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడుగా ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి చేసిన సేవలకు ఈ అవార్డు దక్కినట్లు తెలిపారు. ఈనెల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కర్నూలులో జరిగే గురుపూజోత్సవ కార్యక్రమంలో అవార్డు అందుకుంటారన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్‌ను కళాశాల సిబ్బంది అభినందించారు.

అంజుమన్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నంద్యాల అంజుమన్ సంస్థ పేద ముస్లిం యువతులకు సామూహిక వివాహాలు నిర్వహించనున్నట్లు అంజుమన్ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. అంజుమన్ షాది ఖానాలో సమూహిక వివాహాలు చేసుకునే ముస్లిం వధువుకు 18, వరుడికి 21 సంవత్సరాలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో గోపికృష్ణ సూచించారు. బుధవారం జూపాడుబంగ్లా గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఇంట్లో ఉన్న తడి, పొడి చెత్తను బయట పడేయకుండా చెత్త సేకరణ బండిలోనే వేయాలన్నారు. పంచాయతీ అధికారులు నూర్జహాన్, మణికంఠ, సర్పంచ్ బాలయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

పగిడ్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏవో మురళీధర్ సూచించారు. బుధవారం ముచ్చుమర్రిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధికారుల సహకారం మరువలేనిది



డీఎస్పీని సత్కరిస్తున్న వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు

ఆత్మకూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రాంతంలో గణేశ్ నిమజ్జన క్రతువులో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల సహకారం మరువలేనిదని వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు గరుడాద్రి సుదర్శన్, రాసంశెట్టి చంద్రశేఖర్, శేగు కిరణ్‌కుమార్, ఆవులరెడ్డి పేర్కొన్నారు. ఆగస్టు 29న వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో బుధవారం డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్, రూరల్ సీఐలు డీ.రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుతో పాటు ఉత్సవానికి సహకరించిన దాతలను వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వినాయక ఉత్సవ సమితి ప్రతినిధులు వెంకటరమణ, పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.

మాటలు తప్ప చేతలు శూన్యం

● రైతు సంఘం ధ్వజం

పాణ్యం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యూరియా సరఫరాపై ప్రభుత్వం మాటలు తప్ప చేతలు శూన్యమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. బుధవారం పాణ్యం వ్యవసాయ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ చూసినా యూరియా కొరత ఉందని, కానీ ప్రభుత్వం ఏమో ఎక్కడేగాని కొరత లేనట్టు పేర్కొంటోందని తెలిపారు. పలు ప్రాంతాల్లో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతోందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈఓ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి రామచంద్రుడు, మండల నాయకులు ఖాసీం, సీఐటీయూ కార్యదర్శి భాస్కర్, ప్రసాద్, కేజే శ్రీనివాసులు, సుందరేశం, రాజు, రమేష్, రామాంజనేయులు, పుల్లయ్య, దేవరాజ్, గణేశ్, రైతులు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న లక్ష్మీదేవి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని జిల్లా అధికారి ఎం.లక్ష్మీదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేశామన్నారు. అలాగే ట్రెజరీ కార్యాలయం భవనం వెనుక ఉన్న పాత భవనాన్ని పరిశీలించారు. మరమ్మతులకు రావాల్సిన నివేదిక తయారు చేయాలని సూచించారు. ఆమె వెంట ఎస్టీవోలు అంజద్‌బాషా, సురేశ్, సీనియర్ అకౌంటెంట్ మస్తాన్‌వలి ఉన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

శిరివెళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ని గిరి జనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం పచ్చర్ల గ్రామంలో ఎమ్మెల్యే పర్యటిం చారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్థులు ఎ మ్మెల్యేను సన్మానించారు. కార్య క్రమంలో ఐటీ డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట శివప్రసాద్, ఎంపీడీవో శివ మల్లేశ్వ రప్ప, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాయకు లు, అధికారులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

ఆళ్లగడ్డ,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుదని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. బుధవారం ఎమ్మెల్యేను రాష్ట్ర మీట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఎం. అజీమోద్దిన్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు అన్సర్‌బాషా, నరసింహారెడ్డి, కొలిమి హుసేన్‌వలి, మాబులాల్, నరసింహారెడ్డి, గఫార్, మౌలాలి పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

శిరివెళ్ల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్ప ని సరిగా రహదారి నియమాలు పాటించాలని శిరివెళ్ల ఎస్‌ఐ చిన్న పీరయ్య సూచించారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి పై బుధవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో శంషాద్‌బేగం సూచించారు. బుధవారం ధర్మవరం గ్రామంలో పోషకాహార వా రోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్త జులేఖ, బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం డిజిటల్ సమాజంలో సైబర్ నేరాలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రమేష్‌బాబు బుధవారం సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నకిలీ ఫైల్స్‌ను ఓపెన్ చేస్తే, బ్యాంకు ఖాతాల నుంచి నగదు దొంగలించే ప్రమాదం ఉందన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

మొక్కజొన్న పంటపై పందుల దాడి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలాయపల్లెలో మొక్కజొన్న పంటపై పందులు దాడి చేశాయి. దాంతో పరిసర గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్ట దశలో ఉన్న మొక్క జొన్నపై పందులు దాడి చేయడంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని డాక్టర్ జ్యోతిర్మయి అన్నారు. బుధవారం కేజీబీవీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ అబీదా బేగం అధ్యక్షతన వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఉపాధ్యాయురాలు గీత, శ్రీదేవి, వెంకటలక్ష్మి, సెట్కూరు కళ, నితీష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా కుమ్మరి సుధాకర్



లోకేశ్‌తో సుధాకర్

డోన్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామానికి చెం దిన కుమ్మరి సుధాకర్ బుధవారం నియమితులైయారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే కోట్ల సూ ర్యప్రకాశ్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజా తమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

యాగంటిలో ముగిసిన వేలం

బనగానపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, యాగంటిపల్లె మౌళీశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో వేలాలు నిర్వహించారు. వేలాల ద్వారా క్షేత్రానికి రూ.23.40లక్షల ఆదాయం వచ్చినట్లు ఏఈవో తెలిపారు.

శరవేగంగా రింగ్ రోడ్డు పనులు

- 50 శాతం పనులు పూర్తి
- తీరనున్న బనగానపల్లె పట్టణవాసుల కష్టాలు



పట్టణ శివారులో జరుగుతున్న రింగ్‌రోడ్డు మట్టి పనులు

బనగానపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా దోబూచులాడుతున్న బనగానపల్లె రింగ్‌రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు శరవేగంగా కొనసాగుతున్నాయి. రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పదవీబాధ్యతలు చేపట్టడంతో రింగ్‌రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. బ్రిడ్జి పనులు కూడా చేపట్టడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరనుంది.

నిత్యం ట్రాఫిక్ సమస్య

పట్టణంలో నిత్యం భారీ వాహనాలు తిరుగుతున్నాయి. ఇరుకు రోడ్ల కారణంగా ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. బనగానపల్లె సమీపంలోని యనకండ్ల వద్ద నిర్మించిన జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ, కొలిమిగుండ్ల మండలంలో నిర్మించిన రామ్‌కోసిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలు, ప్యాపిలి మండలంలోని బూరుగుల సమీపంలో నిర్మించిన ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీల నుంచి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు పట్టణం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. 2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.50 కోట్ల వ్యయంతో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రింగ్‌రోడ్డు నిర్మాణం పనుల కోసం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కాని ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో రింగ్ రోడ్డు పనులు నిలిచి పోయాయి. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికా రంలోకి రావడం బీసీ జనార్దన్ రెడ్డి మంత్రి కావడంతో అన్ని అడ్డంకులు అధికమించి పనులు చేపట్టారు. రింగ్ రోడ్డు నిర్మాణం కోసం రైతుల నుం చి 13.5 కిలో మీటర్ల మేర పంట పొలాలను సంబంధిత అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రైతులు కోల్పోయిన భూములకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అకౌంట్లలో జమ చేసింది. మిగిలిన రైతులకు త్వరలో నగదు జమ చేయ నుంది. 18 నెలల్లోనే రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించడంతో పనులు వేగవంతం చేపట్టారు. ఇప్పటి వరకు 50శాతం పనులు పూర్తయ్యాయి.

> బనగానపల్లె రింగ్ రోడ్డును పట్టణ శివారులోని యాగంటిపల్లె ప్రధాన రహదారి నుంచి పాణ్యం రహదారి వరకు నిర్మించనున్నారు. అలాగే రాళ్ల కొత్తూరు నుంచి ఆర్అర్ పంక్షన్‌హాల్ మీదుగా కైప, అప్పలాపురం, టంగుటూరు మీదుగా గాజుల పల్లె వరకు నేషనల్ హైవే పనులు కూడా జరుగనున్నాయి. ఇందులో బనగానపల్లె పరిధిలో రాళ్లకొత్తూరు నుంచి టంగుటూరు వరకు నేషనల్ హైవే పనులు జరుగనున్నాయి.

పనులు వేగవంతం చేశాం

ప్రస్తుతం రింగ్ రోడ్డు పనులు 50 శాతం పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పనులు, ఇతర పనులు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరో 12నెలల్లో మిగిలిన 50 శాతం రింగ్ రోడ్డుపనులు పూర్తి చేసి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తాం.

- హుసేన్ , ఏఈ, ఆర్అండ్‌బీ, బనగానపల్లె

చదువుతోనే సమాజంలో గుర్తింపు : బీసీ రాజారెడ్డి



మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 3, (ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువుల ద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీసత్యసేవాసమితి ఆధ్వర్యంలో నాగేంద్రప్రసాదశర్మ అధ్యక్షతన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీసీ రాజారెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటినుంచి క్రమశిక్షణతో పాటు విద్యాబుద్ధులు, సమాజ సేవా కార్యక్రమాలు నేర్పించాలన్నారు. పిల్లల నడవడికలను ఎప్పటికప్పుడు గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలని సూచించారు. పుస్తకపఠనం, దిన పత్రికలను చదవడం, సమాజ సేవా పరిజ్ఞానం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్‌శర్మ సేవలను కొనియాడారు. మండల విద్యాధికారి స్వరూప మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. సమావేశంలో నందివర్గం మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరావు, శేషిరెడ్డి, భరతుడు, బనగానపల్లె ఉపసర్పంచ్ బురానుద్దీన్, భానుముక్కల సహకార సంఘం అధ్యక్షుడు అత్తార్ అబ్దుల్ కలాం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొలాలకు రస్తా ఏర్పాటు చేయాలి



రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్యామ్‌సుందర్

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్లాంట్ ఏర్పాటులో తమ పొలాలకు వెళ్లేందుకు రస్తా ఏర్పాటు చేయాలని రైతులు మొరపెట్టుకున్నారు. బుధవారం గోవిందపల్లె గ్రామంలో ఆర్డీవో శ్యామ్ సుందర్ రైతుల అభిప్రాయాలు సేకరించారు. సర్వే నెంబర్ 356, 397, 405లో రూపనగుడి, మాయలూరు గ్రామాలకు వెళ్లేందుకు 40 అడుగుల వెడల్పుతో తమకు రస్తా ఇవ్వాలని రైతులు కోరారు. అనంతరం సోలార్ కంపెనీ ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు రస్తా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో సూచించారు. సమావేశంలో తహసీల్దారు సువర్ణాదేవి, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్వోలు, రైతులు ఉన్నారు.

సర్వేలు పూర్తి చేయాలి

ఆళ్లగడ్డ: మండల సర్వేయర్లు నిర్వహిస్తున్న భూసర్వేలు, స్వామిత్వా సర్వేలతో ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా చేపట్టాలని ఆర్డీవో విశ్వనాథ్ తెలిపారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి ఆధ్వర్యంలో సర్వేయర్లతో సమీక్షా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వేలు సమస్యలు లేకుండా త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.

పకడ్బందీగా ధ్రువపత్రాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

బేతంచెర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వివిధ గ్రామాల్లో ప్రజలకు సుమోటో కుల, నివాస ధ్రువపత్రాలను పకడ్బందీగా మంజూరు చేయాలని జా యింట్ కలెక్టర్ విష్ణు చరణ్ ఆదేశించారు. బుధవారం పట్ట ణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జేసీ విష్ణు చరణ్ మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్వోలు మంజూరు చేసే సుమో టో కుల నివాస ధ్రువీకరణ పత్రాల్లో ఎలాంటి తప్పులు లేకుండా ఇవ్వాలన్నారు. తమ తనిఖీల్లో తప్పులు కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పత్రాల్లో తప్పు లు ఉంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని, జాగ్రత్తగా పరిశీలించి ఇవ్వాలన్నారు. సమావేశంలో డోన్ ఆర్డీవో నరసింహులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

భూముల డాక్యుమెంట్లను అప్పగించాలి

రైతులు భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను పది రోజుల్లోపు తహసీల్దార్ కార్యాల యంలో అప్పగించాలని డోన్ ఆర్డీవో నరసింహులు సూచించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నాగమణి అధ్యక్షతన మండలంలోని కొలుములపల్లె, ఆర్ఎస్.రంగాపురం బేతంచెర్లకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఎరోన్ గాలి మరల కంపెనీ ప్రతినిధులు ఏర్పాటు చేసే గాలిమరలను రైతులు తమ భూముల్లో వేయొద్దని అడ్డుకుంటున్నారని అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. దాంతో ఆయా గ్రామాల రైతులతో ఆర్డీవో నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను రైతులు ఆక్రమించినట్లు తమ సర్వేలో తేలిందన్నారు. సాగు భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను అప్పగించాలని కోరారు. సమావేశంలో ఆయా గ్రామాల వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

ఏపీపీ లక్ష్మన్నకు సన్మానం

డోన్ టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన గువ్వలకుంట్ల కురువ లక్ష్మన్నను బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామయ్య, రామచంద్ర నాయుడు, రాజ్‌పుత్ కమలేష్ ముదిరాజ్, లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం చూపించండి

బనగానపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిట్టపల్లె గ్రామంలో శ్మశానవాటికకు స్థలం చూపాలని ఎస్సీ, ఎస్టీ వర్గీయులు కోరారు. బుధవారం తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసిరెడ్డి, పుల్లయ్య, రామాంజనేయులు, దస్తగిరి, మౌలాలి, బాలుగ్రం, వెంకటేశం, నాగయ్య సంకటి దస్తగిరి, చంద్రశేఖర్, ఓబుళపతి, శివ, మనోహర్, శ్రీకాంత్, రవింద్ర, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బనగానపల్లె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పలుకూరు యూని యన్ బ్యాంక్ మేనేజరు కార్తీక్ అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరులో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బ్యాంకింగ్ పై అవగాహన కల్పించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం హజరత్, రామసుంకన్న, నబీరసూత్, కౌన్సిలర్లు బాలాంజనేయులు, గురుశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని ఏడీఏ విజయశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. రేపటిలోగా రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపారు.

త్వరలో రైతుసేవ కేంద్రాలకు యూరియా

అవుకు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : త్వరలో రైతు సేవ కేంద్రాలకు యూరియా వస్తుందని వ్యవసాయాధికారి మున్నీసా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 4, 5, 10, 13 తేదీల్లో జిల్లాకు 9300 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

బనగానపల్లె : బనగానపల్లె మండలంలో యూరియా కొరతలేదని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారంలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

రుద్రవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె మెట్ట సమీపంలో బుధవారం రాత్రి బైక్ అదుపు తప్పి కిందపడింది. దాంతో చిన్నకం బలూరుకు చెందిన చెన్నకేశవ అనే వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. 108లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోట్ల మహాలక్ష్మి ఎన్నికపై హర్షం

బేతంచెర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర సభ్యురాలుగా కోట్ల మహాలక్ష్మి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి తిరుమలేష్, ఆశా వర్కర్లు హర్షం వ్యక్తం చేశారు.

మెనూ తప్పనిసరి: ఎంఈవో

చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈవో అనూరాధ తెలిపారు. బుధవారం చాగలమర్రి పాతబస్టాండు సమీపంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిపెట్టిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, సీఆర్పీ ఖాసీం పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహకం

చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పండ్ల తోటల సాగుకు హార్టికల్చర్ ద్వారా రైతులను ప్రోత్సహించాలని ఏపీవో ఉమామహేశ్వర్ సూచించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో ఎఫ్ఏ, టీఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హార్టికల్చర్ ద్వారా 120 ఎకరాలను గుర్తించామని అన్నారు. వందశాతం సబ్సిడీతో 16 రకాల పండ్ల తోటల సాగుకు రైతులకు మొక్కలను అందిస్తున్నామన్నారు. కంపోస్టు పిట్ కింద 167 పనులు మంజూరుకాగా 42 పూర్తి చేశామని అన్నారు. పక్కా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారుల గృహాల వద్ద 90 రోజుల పనిదినాలకు మస్టర్లు వేస్తున్నామన్నారు. వర్షాలు పడుతుండటంతో ఉపాధి పనులు నిలిచి పోయాయని తెలిపారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా నరసింహారెడ్డి



చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా న్యాయవాది కరిమద్దెల నరసింహారెడ్డి నియామకమయ్యారు. మండలంలోని చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన నరసింహారెడ్డిని అధిష్ఠానం గుర్తించి ఈ పదవిని అప్పగించారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో గ్రామాల అభివృద్ధికి చేయూత అందిస్తామన్నారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన సాధారణ గ్రామ సభ

చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ తులశమ్మ, ఉప సర్పంచ్ సోహెల్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. మురుగు కాలువలు, సీసీ రోడ్ల ఏర్పాట్లకు ప్రతిపాదనలు చేసేందుకు సభా తీర్మాణం చేశారు. గ్రామాభివృద్ధే లక్ష్యమని సర్పంచ్, ఉప సర్పంచ్ పేర్కొన్నారు. సమావేశంలో ఈవో తారకేశ్వరి, సీనియర్ అధికారిణి నాగమణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఆళ్లగడ్డ ఎస్‌ఐ వరప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు వేంకటేశ్వరస్వామి కల్యాణం

చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి బుధవారం తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో దంపతు లతో కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు అంజలి సూచించారు. బుధవారం చాగలమర్రి మూడవ సచివాలయంలో సంచార వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వివిధ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాలు పడుతుండటంతో జలుబు, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, వ్యాధులు వచ్చిన వెంటనే చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్రబాబు, హెచ్‌ఏ మనోహర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా, నానో డీఏపీ వాడకం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రంగనేతాజీ అన్నారు. మండలంలోని మల్లేవేముల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ వరి పంటలో ఎకరాకు 96 కిలోల నత్రజని, 32 కిలోల భాస్వరం, పోటాష్‌ను వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డిప్యూటీ రేంజర్‌గా ముక్తర్‌బాషా

రుద్రవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం రేంజ్‌లోని అహోబిళం డిప్యూటీ రేంజర్‌గా ముక్తర్‌బాషాకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు రేంజర్ ముర్తుజావలి తెలిపారు. అలాగే రుద్రవరం సెక్షన్ ఆఫీసరుగా రాణెమ్మకు అదనపు బాధ్యతలు అప్పగించారు. విధులపై నిర్లక్ష్యం చేయొద్దని, అప్రమత్తంగా ఉండాలని రేంజర్ సూచించారు. అలాగే రుద్రవరం నర్సరీలో లక్ష మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు.

రేపు కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ప్రారంభం

డోన్ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదుర్తి గ్రామ సమీపంలో సెక్రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల కృత్రిమ అవయవాల, సహాయ పరికరాల తయారీ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ ఫౌండర్ డైరెక్టర్ సీసీ తిప్పన్న తెలిపారు. బుధవారం డోన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సెక్రెడ్ సంస్థ ఏరియా కో ఆర్డినేటర్ శివశంకర్, ఫిజియోథెరపిస్ట్ మారుతి ప్రసాద్ ఆర్థో టెక్నీ షియన్ ఆదిశేషయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సొసైటీ చైర్మన్ శివారెడ్డి ప్రమాణ స్వీకారం



కొలిమిగుండ్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమంతుగుండం సొసైటీ చైర్మన్ కోటపాడు గ్రామానికి చెందిన మూల శివారెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా అవకాశం కల్పించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలి పారు. సభ్యులుగా కమ్మవారిపల్లె మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎర్రగుడి నిమ్మకాయల దస్తగిరయ్య ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రైతుల సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని శివారెడ్డి పేర్కొన్నారు.

పాఠశాలలకు ప్రింటర్లు వితరణ



కుర్చీలను వితరణ చేసిన పీఆర్టీయూ సంఘం నాయకులు

చాగలమర్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు ఉన్నత పాఠశాల, చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలకు ప్రింటర్లను బుధవారం పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో విరాళంగా హెచ్‌ఎంలకు అందజేశారు. చాగలమర్రి బాలికోన్నత పాఠశాలకు 20 కుర్చీలను విరాళంగా ఇచ్చారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, పీఆర్టీయూ సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా కౌన్సిలర్ నారాయణమూర్తి, రవిప్రకాష్‌రెడ్డి, సుబ్రమణ్యం, మండల నాయకులు మహేంద్ర, దస్తగిరి, శివరామచంద్రన్, శివరామకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మయ్య, హెచ్‌ఎంలు జీవయ్య, శ్రీనివాసులు, శివలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.